ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటా

రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న

జగద్గిరిగుట్ట: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సేవ చేస్తానని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారుడిగా ఇటీవలే నియమితులైన సందర్భంగా జగద్గిరిగుట్టలో గురువారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్, డాక్టర్ సత్యనారాయణ, ప్రపంచ మానవ హక్కుల సమితి నేషనల్ డైరెక్టర్ మధుబాబు చికిలే, సాజిద్, సాయికుమార్, శివాజీ పంతులు, శేఖర్, సెల్వరాజ్, శ్యామ్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా సుజాత

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా సుజాత నియమితులయ్యారు. ఆరు నెలల నుంచి స్థానికంగా ఉన్న తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్ సెలవుపై వెళ్లారు. తహసీల్దార్ సెలవులో ఉండటంతో ఆరు నెలలుగా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై సాక్షి పలుమార్లు కథనాన్ని ప్రచురించింది. దీంతో జిల్లా కలెక్టర్ కీసర డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సుజాతను కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ పనిచేసిన అబ్దుల్ రెహమాన్ ఖాన్‌ను కీసర డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎం.ఎస్.వాసు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ మాజీ కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు గురువారం ఆ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచంద్రరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ.. రామచంద్రరావు ఆధ్వర్యంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో విజయేందర్‌రెడ్డి, కళ్యాణి శ్రీనివాస్, సత్తిబాబు రాజు, యనమదల గిరిబాబు, వెంకటరత్నం, శ్రీనివాస్ గుప్తా, విఘ్నేష్, దారెల్లి రవి, చిన్నస్వామి, దేవి, భారతీరెడ్డి, అనిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనుమతులు లేని భవనాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం నిజాంపేట్‌లోని పలు భవనాలను పాక్షికంగా కూల్చివేశారు. అనుమతి లేని నిర్మాణాలు ఎవ్వరు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న పున్నారెడ్డి

సుభాష్‌నగర్: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినం సందర్భంగా గురువారం గాజులరామారం ఎస్పీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మార్కెట్‌కి వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ బ్యాగులు తీసుకెళ్లవద్దని సూచించారు. త్వరలో ఎస్పీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించి తక్కువ ధరలో పంపిణీ చేయాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి


ఓల్డ్ బోయిన్‌పల్లి: టీబీ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హస్మత్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎలిజా కెనడీ అన్నారు. గురువారం టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హస్మత్‌పేట మోడల్ మార్కెట్‌లో ఏఐ ఎక్స్‌రే ద్వారా 145 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వ్యాధి సాధారణ లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

ప్రబలుతున్న విష జ్వరాలు!

డెంగీ, మలేరియాతో ఆసుపత్రులకు రోగుల తాకిడి ↓ మురికివాడల్లో కనిపించని వైద్య శిబిరాలు ↑ దోమల నివారణకు చర్యలు అంతంతే ↓ పట్టించుకోని అధికారులు

నియోజకవర్గంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియాతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మురికివాడ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి డెంగీ, మలేరియా, ఇతర అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి. అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. కానీ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.





కుత్బుల్లాపూర్ : విష జ్వరాలు ప్రబలకుండా అధికారులు అప్రమత్తమై మురికివాడ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సుమారు 15 లక్షల జనాభా కలిగి ఉన్న ఈ ప్రాంతం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉండగా నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అత్యధిక మురికివాడ ప్రాంతాలు

నియోజకవర్గ పరిధిలో సుమారు 60 శాతం మురికివాడ ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ నివసించే పేద ప్రజలు కష్టపడితేనే పూట గడవని పరిస్థితుల్లో ఉన్నారు. అటువంటి వారికి జ్వరాలు వస్తే ఇక చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. గత సంవత్సరం కూడా గ్రేటర్ అధికారులు అంటువ్యాధులు ప్రబలుతున్నా చోద్యం చూడడమే తప్ప ఎటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. తాజాగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మురికివాడ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో అత్యధిక శాతం మురికివాడ ప్రాంతాలు ఉన్న కుత్బుల్లాపూర్‌లో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వైద్య ఆరోగ్య అధికారులు తక్షణం స్పందించి మురికివాడ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పేద ప్రజలకు మెరుగైన చికిత్స అందించే దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

చెరువుల్లో గుర్రపుడెక్క..

నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు గుర్రపు డెక్కతో విస్తరించి ఉన్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది సమీప ప్రాంతాల్లో ఉంటున్న కాలనీలు, బస్తీల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పత్రికల్లో కథనాలు రాగానే గుర్రపు డెక్క తొలగించి అధికారులు చేతులు దులుపుకుంటున్నరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఇంటింటికీ తిరిగి ఇంట్లో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, లార్వా ఎదుగుదల విషయంపై ఇంటి యజమానులకు అవగాహన కల్పించేవారు. చెరువుల్లో గంబుసియా చేపలను వదిలి దోమల లార్వా పెరగకుండా కట్టడి చేసేవారు. ఇప్పుడు ఆ ఊసే మరిచిపోయారు. దీంతో చెరువు ప్రాంతాల్లో ఉంటున్న కాలనీవాసులు అంటు వ్యాధులు ప్రబలి ఆసుపత్రుల పాలవుతున్నారు.

క్రమంగా పెరుగుతున్న కేసులు..

నియోజకవర్గంలో పది రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, మలేరియా విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్యను నమోదు చేసుకొని ఉన్నత అధికారులకు పంపించాల్సిన స్థానిక వైద్య ఆరోగ్య అధికారులు ఆ దిశగా పని చేయడం లేదని తెలుస్తోంది. విష జ్వరాలు ప్రబలే ప్రాంతాల్లో పర్యటించాల్సిన యంత్రంగా అటువైపుగా ఆలోచించడం లేదు. ఆసుపత్రికి కేవలం వచ్చామా..! వెళ్లామా..! అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరింత బాధితులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వారాహిమాతకు ఎమ్మెల్యే పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: గాజులరామారం షిరిడీ హిల్స్‌లోని వారాహి అనుగ్రహ పీఠం ఆధ్వర్యంలో హర్షిత్ మహారాజ్ గురూజీ పర్యవేక్షణలో గురువారం వారాహి అమ్మవారికి ఆషాఢ గుప్త నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో షిర్డీ హిల్స్ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య, నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామిరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం

దుండిగల్: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను ఈ నెల 19వ తేదీన గాజులరామారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సభలకు హాజరు కావాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ సత్యంను శంభీపూర్ రాజు సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షులు ఎండీ యూసఫ్, ఉపాధ్యక్షులు ఏసురత్నం, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు స్వామి, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి స్వామి, సభ్యులు దయాకర్ రెడ్డి, హరినాథ్ రావు, వి శ్రీనివాస్, నరసింహారెడ్డి, బాచుపల్లి శ్రీనివాస్, యాదయ్య, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ఉచిత ట్యూషన్



ట్యూషన్‌లో పాల్గొన్న బాలికలు

నిజాంపేట్: కల్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, సుందరయ్య భవన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రగతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఉచిత ట్యూషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అవకాశం కేవలం ప్రగతినగర్ బాలికలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు కూడా అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కల్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.ప్రశాంత్ కుమార్, సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్యచారి, జేవీవీ నాయకులు శంకర్‌రావు, మాజీ కార్పొరేటర్ వెంకట రామయ్య, రాజేశ్వరరావు, బాల వెంకటేశ్వరరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నా చెరువు.. ఎన్నాళ్లకు ఇలా!

జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువు కొన్ని సంవత్సరాలుగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఇటీవల సంబంధిత అధికారులు గుర్రపుడెక్కను తొలగించారు. దీనికి తోడుగా చెరువులకు వచ్చే మురుగు నీటిని నీటిశుద్ధి కేంద్రం ద్వారా శుద్ధిచేసి చెరువులకు వదలడంతో చెరువు పూర్వవైభవం వచ్చింది. దీంతో జాలర్లు పడవలో చేపలు పడుతుండగా 'సాక్షి' కెమెరాకు చిక్కింది. ఇలాంటి చెరువు వైభవం గతంలో ఉండేదని స్థానికులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. – సుభాష్‌నగర్



నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చింతల్: బాలానగర్ లయన్స్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారని బీజేపీ నాయకుడు విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతల్ డివిజన్ చంద్రానగర్‌లోని రోడ్డు నెంబరు 1 లోని 6వ వీధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉచిత చెకప్‌తో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తారని, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్ : నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి గ్రామంలో కర్డాలకుంటచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను ఆక్రమించుకున్న పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. యాజమాన్యం కాంపౌండ్ వాల్ నిర్మించుకోవడమే కాకుండా చెరువులో స్థలాన్ని చదును చేసి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. దీనిపై బాచుపల్లి ఎమ్మార్వోకి, ప్రజావాణి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

జీడిమెట్ల: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. గురువారం సాయంత్రం మైసమ్మగూడలోని పలువురు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వేగాన్ని నిరోధించడంతో పాటు జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. మూల మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్

కుత్బుల్లాపూర్: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ డిమాండ్ చేశారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక పరిశ్రమలు కనీస వేతనాలు చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య, దేవదానం, శ్రీనివాస్, కరుణాకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వయోజనులు ఓటు నమోదు చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులు

దుండిగల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులు అన్నారు. గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాప్‌లో ఫారం 6,6అ, 7,8,8 అలను ఏ విధంగా నమోదు చేయాలో, వాటిని ఏ విధంగా పరిశీలించాలో వివరించారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతాయని, బీఎల్‌ఓలు ఓటరు గుర్తింపు కార్డు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గండి మైసమ్మ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, కొంపల్లి కమిషనర్ కృష్ణారెడ్డి, బీఎల్‌ఓ ఎలక్షన్ ట్రైనర్ మల్లికార్జున్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రైలు రోకోకు మున్నూరుకాపు సంఘం మద్దతు



నిజాంపేట్: జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను గురువారం మున్నూరు కాపు పటేల్ సంఘం సభ్యులు కలిసి మద్దతు తెలిపారు. బీసీ 42శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి చేయడం కోసం జులై 17న రైలు రోకోకు కవిత పిలుపునిచ్చారు. ఈ పిలుపునకు మున్నూరు కాపు పటేల్ సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి సతీష్, మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పటేల్, మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు ఉపాధ్యక్షులు గంధం శ్రీను పటేల్, భిక్షపతి, మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్ : నిజాంపేట్‌లోని వివిధ సమస్యలను పరిష్కరించాలని గురువారం బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ నిధుల ద్వారా కొన్ని పనులను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరివర్ధన్ రెడ్డి, దాసి నాగరాజు, రచ్చ చక్రధర్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, సచిన్, శ్రీనాథ్, బాబు చౌదరి, సురేష్, ఐటీ సెల్ కన్వీనర్ కిషన్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని అయ్యప్ప కాలనీలో విద్యుత్ వైర్లు యమపాశాలుగా మారాయి. కొన్ని చోట్ల విరిగిన విద్యుత్ పోలు కేవలం విద్యుత్ వైర్లపైనే ఆధారపడి ఉన్నాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ వైర్లు ఊడేలా ప్రమాదపుటంచున ఉన్నాయి. స్థానికంగా ఉన్న మజీద్ వద్ద విద్యుత్ వైరు కేవలం ఒక్క తీగపైనే ప్రమాదకరంగా ఉంది. ఇప్పుడు ఏమీ జరగబోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చదువు చెబుతూ.. శిక్షణ ఇస్తూ..

ఉపాధికి బాటలు వేస్తున్న ఎఫ్‌డీడీఐ క్యాంపస్



రాయదుర్గం: దక్షిణాదిలో ఫుట్‌వేర్ రంగంలో ఉన్నత విద్యాసంస్థగా ఎదిగిన ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్ క్యాంపస్ నేడు ఉత్తమ శిక్షణకు చిరునామాగా మారింది. కళాకారులు, ఇతరులకు నైపుణ్యాలను నేర్పించడానికి దశలవారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్. తేజ్‌లోహిత్‌రెడ్డి నాయకత్వంలో రక్షణశాఖ ఉద్యోగులకు సైతం శిక్షణ ఇచ్చి తమ సత్తాను చాటారు. మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తాజాగా రక్షణశాఖ ఉద్యోగులకు సర్టిఫికెట్ కోర్సు

- ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్, రక్షణ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) పర్యవేక్షణలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సర్టిఫికెట్ కోర్స్ ఇన్ రిటైల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- విశ్రాంత ఉద్యోగులు 22 మందిని ఎంపిక చేసి వారికి రాయదుర్గం ఎఫ్‌డీడీఐలో శిక్షణ ప్రారంభించారు.
- రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఇస్తారు.
- ముఖ్యంగా వినియోగదారులకు అందించాల్సిన సేవలు, అమ్మకాల పద్ధతులు, మెళకువలను నేర్పిస్తున్నారు.

చెప్పులు, షూ తయారీపై శిక్షణ

- కేంద్ర ప్రభుత్వ ఆదేశంపై ఎఫ్‌డీడీఐ, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) సంయుక్తంగా చర్మకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు
- మూడు విడతలలో 25 రోజులపాటు శిక్షణ ఇచ్చారు
- శిక్షణలో అనేక మెళకువలను నేర్చుకున్నామని చర్మకారులు పేర్కొన్నారు

మహిళలకూ నేర్పేందుకు..

- మహిళలు స్వయం సంవృద్ధి బాట పట్టేలా శిక్షణ ఇవ్వాలని ఎఫ్‌డీడీఐ భావిస్తోంది.
- జనపనారతో రకరకాల బ్యాగులు, చెప్పులు, టోపీల తయారీపై మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంకల్పించినట్లు డాక్టర్ రాంబాబు వివరించారు. –మహిళలు సిద్ధంగా ఉంటే శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.